క్లుప్తంగా

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: గాజువాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణమందిరం, అజీమాబాద్, రాజీవ్ మార్గ్, మార్కెట్ రోడ్, కణితి రోడ్ ఫీడర్లకు శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె. నాయుడు తెలిపారు. ఈ కారణంగా భానోజీ తోట, రాజీవ్‌మార్గ్, సింహగిరి కాలనీ, బీసీ రోడ్, అజీమాబాద్, గాజువాక మార్కెట్, పాత గాజువాక, 60 అడుగుల రోడ్, మెహర్‌నగర్, గాజువాక మెయిన్ రోడ్, కైలాసనగర్, కణితి రోడ్, సమతా నగర్ ప్రాంతాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

టింపనీ ఫీడర్ పరిధిలో

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 28న విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, ఆదర్శ్ గ్రౌండ్ ఏరియాలో శుక్రవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, వయసు 18 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. హెవీ వెహికల్ డ్రైవింగ్ ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99890 14703 నంబరులో ఫోను ద్వారా లేదా తమ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

గురువులుకు చినతల్లి శుభాకాంక్షలు



కోలా గురువులును అభినందిస్తున్న చినతల్లి, పెంటారావు

గాజువాక: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి అభినందించారు. పార్టీ సీనియర్ నాయకుడు పల్లా పెంటారావుతో కలిసి నగరంలో గురువులును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

ప్రతిష్టాత్మకంగా బీజేపీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర

గాజువాక: గాజువాకలో ఈ నెల 29న నిర్వహించనున్న బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని ప్రతి నాయకుడు ప్రతిష్టాత్మకంగా భావించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. గాజువాక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితోపాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొని, పార్టీ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాలిమేర శ్రీను, దానేష్, అనంత మహంతి, శంకరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అందని అలవెన్సులు

- ఈఎస్ఐ చెల్లించాలనడంతో చెల్లింపులు నిలిపిన కాంట్రాక్టర్లు
- యాజమాన్యంతో తేల్చుకోవాలంటున్న కాంట్రాక్టు సంఘాలు
- తేలని వివాదం
- రేపటి నుంచి ఆందోళనకు సిద్ధం



స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

ఉక్కునగరం: మూలిగే నక్కమీద తాటికాయ పడిందంగా ఉంది కాంట్రాక్ట కార్మికుల పరిస్థితి. అసలే అంతంతమాత్రం వేతనాలు.. వాటికి అలవెన్సులు కలిస్తేనే గానీ సాఫీగా నెల గడవదు. కానీ ఈఎస్ఐ చెల్లింపుల పేరుతో కాంట్రాక్టర్లు ఆ అలవెన్సులకు కోత పెట్టడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈఎస్ఐ అంశం తేలేవరకు అలవెన్సులు చెల్లించేది లేదని కాంట్రాక్టర్లు చెబుతుండగా.. చెల్లింపుల విషయం యాజమాన్యంతో తేల్చుకోవాలి గానీ, వాటిని ఆపితే అంగీకరించబోమని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ఎటూ తేలని ఈ వివాదం నేపథ్యంలో.. కార్మికులకు ఈ నెల వేతనాలతో పాటు అలవెన్సులు అందలేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఇదీ నేపథ్యం..

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని 2005 సంవత్సరంలో 16 రోజుల పాటు ఆందోళన చేయడంతో, వారికి అప్పటి నుంచి రూ.300 ఐఆర్ చెల్లిస్తున్నారు. 2009 సంవత్సరంలో స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన నాటి కేంద్ర ఉక్కు మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు ఇచ్చిన ఆదేశాలపై అప్పటి నుంచి ప్రత్యేక అలవెన్స్ (ఎస్ఎంఏ) కింద వెయ్యి రూపాయలు చెల్లిస్తున్నారు. అనంతరం 2014లో ఎన్‌జేసీఎస్‌లో జరిగిన చర్చల మేరకు హీట్, డస్ట్ తదితర అలవెన్సుల కింద రూ.1100 చెల్లిస్తున్నారు. ఆర్‌జేసీఎల్ సమక్షంలో కాంట్రాక్టర్లతో జరిగిన ఒప్పందంలో అలవెన్సులు రూ.2400 పై ఎటువంటి పన్ను, పీఎఫ్, ఈఎస్ఐ కట్టనవసరం లేదని పొందుపరిచి ఉన్నట్టు కాంట్రాక్టర్ల సమాచారం. అందులో భాగంగా ఇంతవరకు రూ. 2400 పై కాంట్రాక్టర్లు ఈఎస్ఐ కట్టడం లేదు.

కాంట్రాక్టర్లకు నోటీసులు

ఇటీవల ఈఎస్ఐ అధికారులు అలవెన్సులపై 2009 సంవత్సరం నుంచి ఈఎస్ఐ చెల్లించాలని కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేశారు. దీంతో ప్రతీ ఒక్కరు సుమారు రూ.30లక్షలు కట్టాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ అంశాన్ని కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులు హెచ్‌ఆర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి చర్యలు చేపట్టినట్టు తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఈఎస్ఐ అంశం తేల్చేవరకు కార్మికులకు అలవెన్సులు తాము చెల్లించబోమంటూ కాంట్రాక్టర్ల అసోసియేషన్ బాంబు వేసింది. జూలైలో ఇచ్చే వేతనాలతో చాలామంది కాంట్రాక్టర్లు అలవెన్సులు నిలిపివేశారు. ఈ విషయం తెలిసి కార్మిక సంఘాలు కాంట్రాక్టర్ల నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరిస్తున్నారు. అలవెన్సులపై ఈ నెల 13న ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ అంశంపై ఈ నెల 28 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేయడానికి కార్మిక సంఘాలు సమాయత్తం అవుతున్నాయి.

ఆందోళన ఉధృతం



అలవెన్సుల చెల్లింపుపై కాంట్రాక్టర్ల తీరు సరిగా లేదు. ఈఎస్ఐ చెల్లింపుపై యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈఎస్ఐ అంశం తేలేవరకు కాంట్రాక్టు కార్మికులకు అలవెన్సులు చెల్లించబోమంటూ చెప్పడం అన్యాయం. కార్మికులకు అలవెన్సులు ఇచ్చి తీరాల్సిందే. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం.

– మంత్రి రవి, ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం

895వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో 895వ రోజు సంస్థకు చెందిన ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం జోలికి వస్తే చరిత్ర హీనులవుతారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్న చూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికే దీనస్థితిలో ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేయాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న జగన్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని గంగవరం పోర్టు వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, కొవిరి అమ్మోరు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో గాజువాక డిపో కార్యదర్శి పి. శంకరరావు 13వ రోజు దీక్షలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బస్సులకు స్పేరు పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, సిక్ అయిన సందర్భంలో రోజుల తరబడి విధులకు తీసుకోకుండా వేధించే విధానం విడనాడాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఆర్.హెచ్.జె. రోజెస్, కె.కె.ఆర్.బి. రావు, ఎం.ఎస్.రావు, కె.వి. రమణ కూర్చున్నారు. కార్యక్రమంలో జి. సాయిరామ్, వై.ఆర్. ప్రసాద్, ఎస్.ఎస్.వాసు తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన



సీతానగరం జీవీఎంసీ కల్యాణ మండపం ఆవరణలో నిలిచిపోయిన వర్షం నీరు



చెరువును తలపిస్తున్న ఉక్కు కళావేదిక వద్ద గల ఆటస్థలం



నెల్లిముక్కు జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పెదగంట్యాడ: వర్షం వదలడం లేదు.. ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తూనే ఉంది. దీంతో జన జీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. బుధవారం ఉదయం నుంచి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. తర్వాత ఏకధాటిగా వాన కురిసింది. రోజు మొత్తం తెరిపివ్వకుండా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. రెండు రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్ పౌడర్ అందజేత



అగనంపూడి ఆస్పత్రిలో బాలింతలకు ప్రొటీన్ పౌడర్ అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: రోటరీ క్లబ్ విశాఖ సౌత్ ఆధ్వర్యంలో అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో వంద మంది గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఉమా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గర్భిణుల్లో ఎక్కువ మందిలో పౌష్టికాహార లోపం కనపడుతోందని, దీని వల్ల రక్తహీనత ఏర్పడి ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డకు కూడా ఇబ్బంది కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన పొడితో పాటు టానిక్‌ను అందించామని చెప్పారు. కార్యక్రమంలో గనిశెట్టి ఉమా మహేశ్వరరావు, ఆర్.వి.రాజశేఖర్, కిషోర్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న విజ్ఞాన్ అధ్యాపకులు

అగనంపూడి: దేశ భవిష్యత్తును నిర్ణయించే సత్తా ఓటు హక్కుకు మాత్రమే ఉందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదన రావు అన్నారు. ఓటు ద్వారా సరైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యంపై కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరుల భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోడానికి ఓటు హక్కు ఆయుధంలాంటిదన్నారు. యువత దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సీఈవో ఎన్.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో సుందర్ రామమ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయింపునకు వినతి



దేవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనికోద్యోగులు

అగనంపూడి: మాజీ సైనికోద్యోగుల కోసం సామాజిక భవనం నిర్మించేందుకు అగనంపూడిలో స్థలం కేటాయించాలని శ్రీ పైడిమాంబ ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మికి వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ అగనంపూడి ప్రాంతానికి చెందిన ఆర్మీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు ఐదు వందలకు పైబడి ఉన్నారని తెలిపారు. వారు కార్యకలాపాలు సాగించేందుకు వీలుగా సామాజిక భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

‘మానవత’ సేవలు అభినందనీయం

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించేందుకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు చొరవ చూపడంతో స్థానికులు ప్రశంసిస్తున్నారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక వంటిల్లు ప్రాంతంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి గాజువాక ఎస్ఐ టి.రవి కుమార్‌కు సమాచారం అందించారు. అనాథ మృతదేహం తరలింపునకు ఎవరూ ముందుకు రాని సమయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గాజువాక యూనిట్ సభ్యులు ముందుకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శాంతిరథం ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. సంస్థ సేవలను పలువురు అభినందిస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

గాజువాక: మున్సిపల్ కార్మికులు ఈ నెల 27న చేపట్టనున్న ఒకరోజు టోకెన్ సమ్మె, జీవీఎంసీ కార్యాలయం మహా ముట్టడి కార్యక్రమాన్ని వచ్చే నెల ఒకటో తేదీకి వాయిదా వేసినట్టు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లోను ఈ కార్యక్రమం నిర్వహించడం సాధ్యం కానందున వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. వర్షాల సమయంలో ప్రజల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని, తమ రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

మణిపూర్ మారణకాండపై న్యాయవాదుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న న్యాయవాదులు

గాజువాక: మణిపూర్ మారణకాండను ఖండిస్తూ గాజువాక న్యాయవాదులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో న్యాయ విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గాజువాక కోర్టు కాంప్లెక్స్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వి.లెనిన్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన మారణహోమం, మహిళలపై జరిగిన అత్యాచారాలు, ఆస్తులపై దాడులను యావత్ ప్రజానీకం ఖండించాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మణిపూర్‌లో ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతి కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘాల నాయకులు, న్యాయవాదులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ, వెన్నల ఈశ్వరరావు, పట్టాభి రామారావు, ఎస్.రమణబాబు, సోమేశ్వరరావు, యశోధర వేదమణి, ఆదిలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి, ఎ.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝురి



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రధాన కలశాన్ని శిరసుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి ఆధ్యాత్మిక సిరిని సంతరించుకుంది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని నృసింహ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించగా.. స్వామి నిత్య కల్యాణం కనులపండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహ హోమం

సింహగిరిపై బుధవారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున నృసింహ హోమం జరిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి తిరువీధి ఉత్సవంతో కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి, అక్కడున్న హోమగుండం వద్ద కొలువుదీర్చారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం అనంతరం నృసింహ హోమం నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలందరిచేత స్వామి వారి అష్టోత్తర నామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరసుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కి సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఉభయదాతలకు దేవస్థానం తరపున శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు అప్పాజీ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

వ్యాధి నిరోధక టీకాలపై సర్వే



సర్వే బృందానికి టీకాల గురించి వివరిస్తున్న డాక్టర్ జీవనరాణి

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై జాన్సన్ స్నో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆక్స్‌ఫర్డ్ పాలసీ మేనేజ్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ రెండు సంస్థలకు చెందిన వైద్య బృందం గాజువాక పీహెచ్‌సీలో టీకాలు పొందుతున్న 15 మంది తల్లులు, వైద్యులు ఎం.సుధాకరరావు, సీహెచ్.బద్రినారాయణమూర్తి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణితో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కొత్త వ్యాక్సిన్లను ప్రవేశపెట్టడానికి ఈ సర్వే దోహదం చేస్తుందని ఈ సందర్భంగా వైద్య బృందం తెలిపింది. జాన్సన్ ఇండియా, ఓపీఎం వైద్య బృందంలో సయ్యద్ జధారి, ధామా, సుచిత్ర శ్రీనివాస్, ఎల్.శ్రీకాంత్, ఎస్.సుజాత సింధు, రమేష్ నాయక్ తదితరులున్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997 గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలను తెలియజేశారు. అదే విధంగా యువత వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోటారు వాహన చట్టాలు, తాజాగా వచ్చిన మార్పులు వివరించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాము మాట్లాడుతూ నగరంలో ర్యాంగింగ్, మత్తు పదార్థాలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, పర్యవసానాలు వివరించారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉంటూ తమ ఉన్నత భవిష్యత్‌ని పదిలం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్, ఆచార్య ఎస్.పాల్ డగ్లస్ పాల్గొన్నారు.



వినీలాకాశంలో మేఘాలు దోబూచులాడుతుంటే, పచ్చని చెట్లు పలకరిస్తున్నట్లుగా రమణీయ దృశ్యం కనువిందు చేసింది. బుధవారం మధ్యాహ్నం వర్షం పడే ముందు స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు గార్డెన్ వద్ద కళాకారుడు తీర్చిదిద్దిన పెయింటింగ్‌లా కనిపించి, చూపరులను ఆకట్టుకుంది.

– ఉక్కునగరం

పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఈశ్వరరావు, సిబ్బంది

పరవాడ: పెండింగ్ చలానాలపై మండలంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనకాపల్లి ఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, సిబ్బంది బుధవారం ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేసి, పెండింగ్ చలానాలను రాబట్టారు. సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ మీ సేవ, ఈ చలానా యాప్ ద్వారా నిర్ణీత గడువులోపు చలానాలు చెల్లించాలని సూచించారు.